మూర్తిగారి నోట్లో అన్నం ముద్ద అలాగే వుండిపోయింది. దవడలు కదల్లేదు. "ఏం జరిగింది? ఏమన్నా అన్నావా?" భార్యని ప్రశ్నించారు.

"ఊరు విరిగి మంగలం మీద పడ్డదిట – నేను తేరగా దొరికాను. నేనెందుకంటానండి – కన్నబిడ్డలా చూసుకుంటుంటే" అంది శకుంతలమ్మగారు.

"మీరు నన్ను కన్న బిడ్డలాగా చూసుకుంటున్నారా? ఈ ఆరు నెలలుగా మీ అమ్మాయిల్తో సమంగా చూసుకున్నారా? గుండెల మీద చెయ్యేసుకుని చెప్పండి?" అడిగింది మణి. ఆరు నెలలుగా ఒక్కసారి కూడా తన మాటకి ఎదురాడని వంట పిల్ల అలా అడిగేసరికి శకుంతలమ్మగారికి శివాలెత్తినట్లుంది.

"ఏమిటి నీ పొగరు,మా యింటి వంట వంట బట్టి వొళ్ళు బలిసి..."

"ఆగండి –ఆగండి మీ యింట్లో బాగా తిని బలిశానా? ఈ ఆరు నెలల్లో మీరెన్ని సార్లు వంట యింట్లోకొచ్చి, ఏమేమి మిగిలాయోనని చూసుకెళ్ళారో జ్ఞాపకం చేసుకోండి. గిన్నెలన్నీ మూతలు తీసి చూసేవారు మర్చిపోయారా?"

"నా యిష్టం నా యిల్లు."

"మీ యిల్లే దానికి నేనేం అనటం లేదు. మీకన్న బిడ్డగా చూశానంటున్నారే. అందుకడుగుతున్నాను. కూర మిగిల్చారా, పప్పు వదిలారా, పచ్చడి వేసుకు తింటుంటే ఒక్క రోజన్నా "అయ్యో" అని అన్నారా? అనుకున్నారా?"

"నిన్ను వండుకోవద్దన్నానా?"

"మీరంతా తిన్నాక, గ్యాస్ వెలిగించి, కూర వండుకోమనా? అలా వండుకున్న రోజు మీరు భరించగలిగేవారా? మీ అరుణకి అన్నీ వేడిగా మూత పెట్టేవో లేదో అని పదిసార్లు అడిగేవారే మరి నా గురించి ఒక్క రోజున అడిగారా?"

శకుంతలమ్మగారికి ఎలా జవాబు చెప్పాలో తెలియడంలేదు. మణి ఇలా నిలదీస్తుందని అనుకోలేదు. ఆ పిల్ల కూరవేసుకున్న తిన్న ప్రతిసారీ తనకి కచ్చగా వుండేది. ఊరగాయ వేసుకుంటే తృప్తిగా వుండేది.

"అసలు నీ ధోరణే మారిపోయింది. నేను అనుకుంటూనే వున్నాను. నువ్వు కొంప ముంచుతావని."

"పని మానేస్తానంటే కొంపముంచటమా?"

"అసలు నీకు నేను ఏం లోటు చేశాను? వుంటానికి గది, హాయిగా పెద్ద యిల్లు."

"నీకెంత ధైర్యమే! నా ముందు అలా నవ్వుతావా?"

"అవునండి వుండటానికి గది యిచ్చారా. మీకు జ్ఞాపకం వుందా? మొదటి వారం రోజులూ బయట గొళ్ళెం పెట్టారు. నేను పారిపోతానేమోనని"

"నీ కోసం నీ మంచి కోసం బయట గొళ్ళెం పెట్టాను"

"లోపల ఘడియ లేనప్పుడు నాకు సేఫ్టీ ఏమిటండీ? బయట గొళ్ళెం తీసి ఎవరు బడితే వారు లోపలికి రావచ్చు. కావాలంటే మీ సూర్యాన్ని అడగండి సామాను ఎత్తుకుని పారిపోతానేమోనన్న భయంతో బయట గొళ్ళెం పెట్టారు నా గురించి కాదు."

"ఇప్పుడదంతా దేనికి?" మూర్తిగారు గట్టిగా అడిగారు.

"సూర్యం గురించి కాసిని నిజాలు మీరంతా విని ఆనందించాలని.. బయట గొళ్ళెం తీసి లోపల వారికి సాయంగా పడుకోవాలని, చాలా ప్రయత్నించాడు. కదూ సూర్యం? నాకోసం ప్రత్యేకంగా కార్పెంటరీని పిలిచి, లోపల ఘడియ కూడా పెట్టించాడు. ఎందుకో తెలుసా? నాకు సాయంగా వుండాలని" నవ్వుతూ అంటున్న మణి మాటల్లో గల నిజం నసాళానికి అంటి సూర్యం పళ్ళెం దగ్గర నుంచి లేవబోయాడు.

"మూర్తిగారూ మీ ముద్దుల కొడుకు గురించి తెలుసుకోవలసిన విషయాలు చాలా వున్నాయి."

తనని పేరు పెట్టి ఆ పిల్ల పిలిచేసరికి మూర్తిగారికి తాటి ప్రమాణాన కోపం వచ్చింది, కాని మళ్ళీ సర్దుకుని "ఏం చేశావురా – వెధవా?" అడిగారు.

"అతను చెప్పడండి అర్ధరాత్రి మంచి నిషాలో యిద్దరు ఫ్రెండ్స్‌తో వచ్చి ప్రేమ బిక్షపెట్టమని నాకాళ్ళు పట్టుకుని ఏం సూర్యం? నేను నీకోసం పడి చచ్చిపోతాన్నానని ఇంగ్లీషులో కోతలు కోశావ్ జ్ఞాపకం వుందా? నాకు యింగ్లీషు రాదని"

"యూ బిచ్..."

"సరిగ్గా యిదే మాట – ఆ రాత్రి వాడాడండి. తన ఫ్రెండ్స్‌తో నేను సినిమాకి రాలేదని. ఇంట్లో తెలియకుండా తీసుకెడ్తానని ఎన్ని సార్లు బ్రతిమాలుకున్నావో మీ నాన్నగారికి చెప్పు."

"యూ – యూ స్కంవుండ్రల్" పళ్ళు బిగించి అరుస్తున్నాడు సూర్యం

. "మీ పేరు పెట్టి పిలిస్తే మీకంత కోపం వచ్చిందే. నన్ను బిచ్ చీ సీ ఉమన్ అని, మీ సూర్యం అన్నప్పుడు నాకెంత కోసం వచ్చి వుండాలి? వంట మనిషిని ఎవరూ లేనిదాన్ని అని, నా వెంటబడి యిబ్బంది పెట్టి" ఆగింది మణి.

"మేము ఊరు కుంటామా?" అన్నారు శకుంతలమ్మగారు యింకేమనాలో తెలీక.

"మీరంతా పైన ఎ.సి రూముల్లో తలుపులు బిగంచుకు పడుకుంటారు పగలంతా బండ చాకిరీ చేసి, వండి వార్చిన నేను ఎక్కడ పడుకున్నాను, ఎలా పడుకున్నాను ఆలోచించారా? మీ ముద్దుల కొడుకు తాగి అర్ధరాత్రి వస్తే అన్నం పెట్టమని పురమాయించారే మీ బిడ్డ అయితే అలా చేయనిస్తారా?"

"నువ్వు అదీ ఎలా ఒకటవుతారు?"

"మరి మీరే అన్నారుగా కన్న బిడ్డలా చూసుకున్నానని"

"నీకు తెలిసిన వాళ్ళు ఎవరైనా వుంటే చెప్పు" అన్నారు మూర్తిగారు.

"చెప్పటానికేం చెపుతాను. మీరంతా మారితే తప్ప ఎవరూ వుండరు. మీ యింట్లో ఒక్క వంట మనిషి నిలవదని జార్జి చెప్పినపుడు అసలు కారణం కనుక్కుందామనీ నా అవసరమూ రెండు కలిసొస్తాయని చేరాను. మీకు అథారిటీ చెయ్యటం తప్ప మనిషిని మనిషిగా చూడగల శక్తిలేదు. అది వచ్చాక చెప్పండి, మంచి మనిషిని కుదిరి పెడ్తాను" అంది మణి పెరుగు వడ్డిస్తూ.

పెరుగు కమ్మగా వుంది. కాని వొక్కళ్ళకీ ఆ పెరుగు ముద్దలు గొంతులోంచి దిగడంలేదు. మణిని చూస్తుంటే సిగ్గు, భయం. ఎక్కడో మనసు పొరల వెనక ఈర్ష్య, దానిని ఆనుకుని ఎడ్మిరేషన్.

ఎంగిలి పళ్ళాలు ఎవరికి వారు తియ్యబోతుంటే,

"ఇది మీ పనికాదు – నా పని"అంటూ పళ్ళాలు తియ్యనివ్వని మణి మాటని కాదని తోసిపుచ్చే ధైర్యంకూడా లేకపోయింది. పట్టుబడిన దొంగల్లాగ, మేడ మీదకు జారుకున్నారు ఎక్కడి వాళ్ళక్కడ. మణి టామీకి పెట్టడానికి పెరుగు అన్నం కలిపి, తనలో తను నవ్వుకుంటూ, దాన్ని పేరు పెట్టి పిలిచింది. టామీ ఎప్పటిలాగా తోకాడించుకుంటూ గబగబా వచ్చింది." ' కుయ్ కుయ్' మంటూ పదేళ్ళయినా యిది నన్ను మర్చిపోదు. కాని ఈ యింట్లో వాళ్ళు? తెల్లారితే నేను గుర్తుండను. ఈ అధ్యాయం యిక్కడితో ముగిసిపోయింది" అనుకుంది మణి టామీ వంక ఆర్ద్రతతో చూస్తూ.

COMMENTS